## ముగిసిన పులుల గణన


సిబ్బందితో ఎఫ్ఆర్వో థామస్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఈనెల ఒకటిన మొదలైన పులుల గణన సోమవారం ముగిసింది. 4.87 లక్షల ఎకరాల విస్తీర్ణం కలిగిన అటవీ ప్రాంతంలో చిత్తూరు ఈస్టు, వెస్టు, కార్వేటినగరం, పలమనేరు, పుంగనూరు, కుప్పం రేంజ్‌లు ఉన్నాయి. ఈ రేంజ్‌ల పరిధిలో 24 సెక్షన్లు, 84 బీట్ల సిబ్బంది గణన ప్రక్రియలో పాల్గొన్నారు. నాలుగేళ్లకోసారి ఈ గణన చేపడుతున్నారు. మూడు రోజుల పాటు 15 కిలో మీటర్ల పరిధిలో సిబ్బంది నడుచుకుంటూ వెళ్లి పులులతో పాటు ఏనుగులు, కుందేళ్లు, జింకలు, అడవి పందులు, ముళ్ల పందులు, నెమళ్లు, దుప్పులు, అడవి దున్నలు, సర్పజాతి జీవాలను లెక్కలు కట్టారు.. జంతువుల పాదముద్రలు, పెంటికలు, అడవుల్లో జంతువులకు మధ్య జరిగిన పోరాటాల సమయంలో కారిన రక్తపు మరకలు, తదితర వాటిని ఆధారంగా చేసుకుని గుర్తించి, ఫోటోలు తీశారు. అవసరమైన మేరకు అటవీ సరిహద్దు గ్రామస్థుల సహకారం తీసుకున్నారు. అటవీ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజీ వివరాలనూ పరిగణనలోకి తీసుకుని లెక్కలు కట్టారు. వన్య ప్రాణులు, అటవీ ప్రాంతవృక్ష జాతులను సైతం గుర్తించారు. వాటి స్వభావాలను, ఔషధ తయారీకి పనికి వచ్చే మొక్కలను గుర్తించారు. ఆది, సోమవారాల్లో పూర్తి సాంకేతికను ఉపయోగించి వన్యప్రాణుల జాడలు, సంచరించే ప్రదేశాలు గుర్తించారు. గణన ప్రక్రియ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

## చిరుత పులికి మరో ఆవు బలి

తవణంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా చిరుతపులి దాడులకు పాడి ఆవులు, మేకలు బలవుతున్నాయి. తాజాగా చెర్లోపల్లె సమీపంలోని శివకోన అడవిలో చిరుతపులి పాడి ఆవును చంపి తిన్న వైనం సోమవారం వెలుగు చూసింది. బాధితుడు పరదేశి కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఈ రైతు తన పాడి ఆవును ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని శివకోన అడవిలో మేత కోసం వదిలిపెట్టాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో అడవిలో వెతికాడు. శివకోనలోని దేవాలయానికి సుమారు కిలో మీటరు దూరంలో ఆవు మృతదేహం బయటపడిందన్నాడు. చిరుత చంపి తిన్నట్లు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆవు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎంఘటనా స్థలంలో చిరుతపులి పాదముద్రలను అధికారులు సేకరించారు.

## కొత్త పంచాయతీలకు
# పచ్చజెండా

- ప్రతిపాదనలకు 20 వరకు గడువు




చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల విభజనకు పంచాయతీరాజ్ శాఖ పచ్చజెండా ఊపింది.కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేయాలంటే గ్రామంలోని జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవిన్యూ సర్వే నెంబర్ల విభజన తదితరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. కొత్త పంచాయతీల ఏర్పాటు, నవరణలపై నిషేధం ఎత్తివేయడంతో పెద్ద పంచాయతీలను రెండుగా విభజించేందుకు, దూరంగా వున్న గ్రామాలను దగ్గర పంచాయతీల్లో విలీనం చేసేందుకు అవకాశం ఏర్పడింది. జిల్లాలో వి.కోట వంటి పెద్ద పంచాయతీని రెండుగా విభజించడం, బంగారుపాళ్యం మండలంలోని కొన్ని చిన్న పంచాయతీలను విలీనం చేసేందుకు అవకాశాలున్నాయి.

**ప్రతిపాదనలు వస్తున్నాయి**



క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నాం. కొత్తవాటికి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నాం.ఇప్పటికే సుమారు 10 పంచాయతీల నుంచి వినతులు వచ్చాయి. అసమగ్రంగా వున్న వినతులను వెనక్కి పంపి సరిచేసి పంపాలని ఆదేశించాం. ఈనెల 20లోపు ప్రతిపాదనలు స్వీకరించి, ప్రభుత్వానికి పంపిస్తాం.

- కె.సుధాకర రావు, డీపీవో, చిత్తూరు

### మార్గదర్శకాలు ఇవీ

పంచాయతీల ప్రస్తుత పాలకవర్గం తీర్మానం చేయాలి. మార్పులు-చేర్పులు మండల పరిధిలోనే చేస్తారు. ఒక మండలానికి చెందిన కుగ్రామాన్ని లేదా పంచాయతీని మరో మండలంలో కలపడం లేదా విభజించడం కుదరదు. పాలకవర్గాలు లేని పంచాయతీల్లో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గ్రామసభ ద్వారా తీర్మానం చేస్తారు. సంబంధిత తీర్మానాలను కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు అందజేయాల్సివుంటుంది.

**సంక్షిప్తంగా..**

| | |
|---|---|
| మండలాలు | : 32 |
| పంచాయతీలు | : 697 |
| ఎన్నికలు జరిగినవి | : 684 |
| ఎన్నికలు జరగనివి | : 13 |
| మేజర్ పంచాయతీలు | : 11 |
| మైనర్ పంచాయతీలు | : 686 |
| ఆవాసాలు | : 3,67,659 |
| గ్రామీణ జనాభా | : 18,76,361 |

## మరో రెండు స్క్రబ్ టైఫస్ కేసుల నమోదు

చిత్తూరు రూరల్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం మరో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు బయట పడ్డాయి. జీడీనెల్లూరు మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి , తవణంపల్లి మండలం పల్లెచెరువు గ్రామానికి చెందిన మరో వ్యక్తి స్క్రబ్ టైఫస్‌తో బాధపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బాధితులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



## కప్పేసిన మంచు దుప్పటి


నీవానది బ్రిడ్జిపై లైట్ల వెలుతురులో ప్రయాణిస్తున్న వాహనదారులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధరనెల్లూరు మండలాన్ని పొగమంచు కమ్మేసింది.ఆదివారం రాత్రి నుంచే చలి వణికించగా సోమవారం ఉదయం 9గంటలైనా పొగమంచు వీడలేదు.వాహనదారులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సివచ్చింది.

## బీజేపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం


కవితారాజు | కైలాసం | ముబారక్ | శేఖర్ | సుజిత్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ అనుబంధ శాఖలకు జిల్లా అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు సోమవారం వివరాలను వెల్లడించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బి.కైలాసం, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పి.సుజిత్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా జి.కవితారాజు, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సయ్యద్ ముబారక్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా కె.శేఖర్ నియమితులయ్యారు.

## అంధ విద్యార్థి
# సాహసం


చిత్తూరు శివారు ప్రాంతమైన వరిగపల్లె వద్ద హర్షవర్ధన్ స్కేటింగ్

**నంగిలి నుంచి పుత్తూరు దాకా హైవేపై స్కేటింగ్ మారథాన్**

**పిల్లల్లో డ్రగ్స్ , మొబైల్ వ్యసనాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం**

చిత్తూరు అర్బన్/బంగారుపాళ్యం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో డ్రగ్స్ ,మొబైల్ వినియోగం నానాటికి పెరిగిపోతుండడంపై ఆందోళన చెందిన ఓ 11ఏళ్ళ అంధబాలుడు వాటిపై అవగాహన కల్పించడానికి టాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్‌కు పూనుకున్నాడు. కర్ణాటక సరిహద్దులోని నంగిలి నుంచి సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన స్కేటింగ్ యాత్ర పలమనేరు,బంగారుపాళ్యం, చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి మీదుగా పుత్తూరుకు రాత్రికి చేరుకుంది. తిరుపతిలో నివసిస్తోన్న ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరుకు చెందిన మునిబాబు,రాజకుమారి దంపతులు కుమారుడు మురారి హర్షవర్ధన్. పుట్టుకతోనే అంధుడైన హర్షవర్ధన్ ప్రస్తుతం తిరుచానూరులోని నవజీవన్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు.గత సంవత్సరం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి శిక్షణా తరగతులకు హాజరైన హర్షవర్ధన్ ప్రతిభను గుర్తించిన కోచ్‌లు ప్రతాప్,ప్రేమనాథ్ స్కేటింగ్ నేర్పించారు.పుత్తూరులోని టాలెంట్ స్కేటింగ్ అకాడమీలో ఆరునెలలు శిక్షణ తీసుకున్నాడు. స్కేటింగ్ వరల్డ్‌రికార్డు సాధించాలని నిర్ణయించుకున్న హర్షవర్ధన్ ఆరునెలలుగా రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనాలతో పాటు ఎత్తుపల్లాలను దాటుకుని ఎలా వెళ్లాలో శిక్షణ తీసుకున్నాడు. పిల్లల్లో డ్రగ్స్ , మొబైల్ వ్యసనాలపై అవగాహన కల్పించడమే తన మారథాన్ లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు.శాప్ ఛైర్మన్ రవినాయుడి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన తిరుపతి,చిత్తూరు జిల్లాల క్రీడాసాధికార సంస్థ అధికారులకు సహకారం అందించాలని సూచించారు.వ్యక్తిగతంగా కూడా ఆర్థిక సాయం అందించారు. దీంతో హర్షవర్ధన్ 230 కిలో మీటర్ల దూరం టాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్‌కు సోమవారం పూనుకున్నాడు. హర్షవర్ధన్ స్కేటింగ్ చేస్తూ వెళ్లే మార్గంలో ముందు, వెనకాల పోలీసులతో పాటు అంబులెన్స్ కూడా వెళుతోంది.సోమవారం అర్ధరాత్రి దాటాక గమ్యస్థానాన్ని చేరుకునే అవకాశం ఉందని కోచ్ ప్రతాప్ తెలిపారు. ఈ సాహసాన్ని వజ్ర వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు రికార్డు చేశారు.


బంగారుపాళ్యం వద్ద హర్షవర్ధన్

## కాణిపాక ఆలయ కోనేరు
# ఈశాన్యంలోకి మార్పు

**టీటీడీ సహకారంతో అతిథి గృహం,కల్యాణ మండపాల నిర్మాణానికి ఆమోదం**

**ఆలయ బోర్డు సమావేశంలో తీర్మానాలు**


ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేతో ఈవో, చైర్మన్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రంలో వేద పాఠశాల ఏర్పాటు చేయాలని ఆలయ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఆలయ సమావేశ మందిరంలో సోమవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశాన్ని ఈవో పెంచల కిషోర్ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.టీటీడీ అందజేసిన రూ.25 కోట్లతో అతిథి గృహం,రెండు కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి లభించిందని ఛైర్మన్ మణినాయుడు తెలిపారు.వీటి నిర్మాణ,నిర్వహణ బాధ్యతలు పూర్తిగా వరసిద్ధుడి ఆలయానికే అప్పగించారన్నారు. త్వరలో ఆలయం వద్ద మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు ఈవో వివరించారు. ఇందులో తొలి అడుగుగా పుష్కరిణిని రూ.2.80 కోట్లతో ఆలయ ఈశాన్యంలోకి మార్పు చేయనున్నట్లు తెలిపారు. పాత లడ్డూ భవనాన్ని కూల్చివేయాలని తీర్మానించారు. ఆలయంలో నిర్వహించే ఆర్జిత,ఉచిత సేవలపై ఉభయదారులతో చర్చించి నిర్ణయాన్ని వచ్చే సమావేశంలో తీసుకోనున్నట్లు ఛైర్మన్ తెలిపారు.ఆలయ ప్రచార రథానికి రూ.13 లక్షల వ్యయంతో మరమ్మత్తు చేసి గతంలోలాగా గ్రామాల్లో తిప్పనున్నట్లు తెలిపారు.అలాగే కార్యాలయంలో పనులు వేగవంతం చేయడానికి కొన్ని కంప్యూటర్లు కొనుగోలు చేయాలని ధర్మకర్తల మండలి నిర్ణయించిందన్నారు.ఆలయానికి సమీపంలో ఉన్న వినాయక సదన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఎవరైనా దాతలు రూ.10 లక్షలు చెల్లిస్తే వారికి వినాయక సదన్‌లో ఒక గదిని వారి పేరుపై కేటాయిస్తామన్నారు. బోర్డు సభ్యులు ఊట్ల నాగరాజ నాయుడు, చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ బీవీ.నరేష్‌పరిమి చంద్రకళ, కేఎస్ అనసూయమ్మ, సుధాకర రెడ్డి,సునీత, కొత్తపల్లె శివప్రసాద్, శ్రీపతి సతీష్, పెరుమాళ్ల సుబ్బారెడ్డి,చల్లా కృష్ణవేణి,పి.పద్మలత,వసంత,శ్రీవాణి,ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ప్రసాద్,ధనంజయ, హరిమాధవరెడ్డి, ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ ఆధారిత వ్యవస్థతో తిరుమల ఆలయంలో
# అద్భుత ఫలితాలు

- ఐసీసీసీ పనితీరును వివరించిన అదనపు ఈవో


ఐసీసీసీలోని డ్యాష్ బోర్డు - వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మూడు నెలల కిందట తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో ప్రారంభించిన ఐసీసీసీ సెంటర్ పనితీరును సీవీఎస్వో మురళీకృష్ణ, సెంటర్ నిర్వాహకులు జేపీ(వర్చువల్)తో కలిసి ఆయన మీడియాకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవిష్యత్తులో మంచి దర్శనం చేయించేందుకు డేటా జనరేట్ సిస్టమ్‌కు ఎంతోగానో సహాయ పడుతుందన్నారు. ఎన్ఆర్ఐ దాతల సహకారంతో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల బడ్జెట్‌తో ఐసీసీసీని ప్రారంభించామని, ఇప్పటికే రూ.16.5 నుంచి రూ.17 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక పరికరాలను సమకూర్చామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, పలు సూచనలు చేశారన్నారు. అదనపు ఈవో వివరించిన దాని ప్రకారం..

**ఏఐ ఆధారిత వ్యవస్థవల్ల ఉపయోగం ఇదీ..:** దర్శనానికి ప్రతిరోజు ఎంత మంది భక్తులు వస్తున్నారు, ఏ కంపార్టుమెంట్లలో ఎంత సమయం వేచి ఉన్నారు, ఏ సమయంలో ఎంతమంది దర్శనం చేసుకుంటున్నారు, వారికి సకాలంలో అన్నప్రసాదాలు అందుతున్నాయా, కంపార్టుమెంట్లు ఏవైనా ఖాళీగా ఉన్నాయా వంటి వివరాలను ఈ వ్యవస్థ రికార్డు చేస్తుంది. ఎవరికి ముందు దర్శనం కల్పించాలో కూడా సూచన చేస్తుంది. కంపార్టుమెంట్‌లో 450 మందికి మించి భక్తులు ఉంటే వెంటనే రెడ్ అలర్ట్ ఇస్తుంది. ఒకవేళ తక్కువగా ఉంటే గ్రీన్ స్పేస్ కనిపిస్తుంది. వీరికి దర్శనానికి పట్టే సమయాన్ని కూడా తెలియజేస్తుంది. ఒక భక్తుడు ఎన్ని సార్లు దర్శనానికి వచ్చారు, ఏ సమయంలో ఎక్కడ ఉన్నాడు, ఎంత సమయంలో దర్శనం చేసుకున్నాడనే పూర్తి వివరాలు నమోదవుతాయి. ఇలా ప్రతి అంశం రికార్డు చేయడం ద్వారా దర్శన సమయాన్ని తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుంది. అలాగే ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరిచేందుకు ఈ వ్యవస్థ కీలకంగా వ్యవహరించనుంది. ప్రస్తుతం తిరుమలలో, అలిపిరిలో ఎన్ని వాహనాలున్నాయి, ఎంత సమయం ఉన్నాయి, బ్లాక్ లిస్ట్‌లో ఉన్న వాహనాలేవైనా తిరుమలకు చేరుకున్నాయా, నో పార్కింగ్‌లో ఉన్న వాహనాలు ఎన్ని ఇలా ప్రతిదీ ఈ వ్యవస్థద్వారా తెలుసుకోవచ్చు. ఈ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ప్రస్తుతం వైకుంఠం క్యూకాంప్లెక్స్1, 2తో పాటు నారాయణగిరి షెడ్లు, రింగురోడ్డులోని క్యూలైన్‌లో ఉన్న 69 గేట్లతో పాటు నడకమార్గాలు, అలిపిరిలో అదనంగా సుమారు 250 ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేసి ఐసీసీసీకి అనుసంధానం చేయనున్నారు.

### భవిష్యత్తులో ఇవీ ప్రయోజనాలు..

- కంపార్టుమెంట్లు, క్యూలైన్లలోని భక్తుల ఎమోషన్స్‌ని కూడా ఈ వ్యవస్థ ముందుగానే పసిగట్టి హెచ్చరిస్తుంది. ఏదైనా గొడవలు జరిగేట్టు ఉన్నా, అగ్నిప్రమాదాలు జరిగినా గుర్తించి ఆయా విభాగాల అధికారులకు సమాచారం చేరవేస్తుంది.
- పాతనేరస్థుల డేటాను కూడా ఈ వ్యవస్థలో పొందుపరుస్తారు. వీరిలో ఏవరైనా క్యూలైన్లు, కంపార్టుమెంట్లలోకి ప్రవేశిస్తే పసిగట్టి అలర్ట్ చేస్తుంది.
- ఎవరైనా తప్పిపోతే, ఆ వ్యక్తి ఫొటోను అప్‌లోడ్ చేసిన వెంటనే ఎక్కడ ఉన్నారో సులువుగా గుర్తిస్తుంది.
- ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు నిషేధిత వస్తువులను గుర్తిస్తుంది.

## స్వర్ణరథంపై వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు.ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు.వేదికపై ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పూజలు నిర్వహించాక భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు.రాత్రి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు.ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు,బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.





# తిరుపతిలో ఈట్ స్ట్రీట్ / జోరుగా సాగుతున్న పనులు

తిరుపతిలో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఈట్ స్ట్రీట్ (ఫుడ్ కోర్ట్)కు వేగంగా అడుగులు పడుతోంది. ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా ఉన్న అచ్యుత దేవరాయలు మార్గంలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 40 నుంచి 50 స్టాళ్ల ఏర్పాటు చేయనున్నారు. 8/16 సైజుగల 12 కంటైనర్లను స్టాళ్లగా మార్చనున్నారు. మిగిలినవి నిర్దేశించిన ఖాళీ స్థలాన్ని స్టాళ్లగా మార్చుకునేందుకు టెండరుదారుకు కేటాయించనున్నారు. రెండు నెలల్లో పూర్తిచేసి, ఫుడ్ కోర్టు అందుబాటులోకి తీసుకురానున్నట్టు కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగాయి. కపిలతీర్థం రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, వెస్ట్ చర్చి ప్రాంతాలను పరిశీలించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక కమిషనర్ మౌర్య ఫుడ్ కోర్టుపై ప్రత్యేక చొరవ చూపించారు. దాదాపు రూ.80లక్షలతో ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తీసుకుని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఫుడ్ కోర్టులోని స్టాళ్లను టెండర్ల ద్వారా కేటాయించనున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


## సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శనివారం హుండీ ఆదాయం: రూ.3.69 కోట్లు**

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,343**

**తలనీలాలు సమర్పించినవారు: 26,505**





# పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలే ఎక్కువ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా పింఛన్లు అందలేదని, ఇంటి పట్టాలకు స్థలం చూపలేదని, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాలు అందలేదని.. ఇలా వివిధ సమస్యలపై 308 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 184 ఉన్నాయి. అర్జీదారుల సమస్యలను విన్న కలెక్టర్ వెంకటేశ్వర్.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి జవాబు ఇవ్వాలని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

### పరిహారం ఇవ్వండి



సూళ్లూరుపేట మండలం ఎర్రబాళెం గ్రామసర్వేలో వంద అంకణాలకుపైగా మా భూమి పోర్టుకట్టకు పోయింది. మిగిలిన భూమి హైవేకు పోయింది. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. భూమి లేకపోవడంతో కుటుంబ పోషణకష్టంగా మారింది.మీరైనా ఆదుకోండి.

- బాలమురళీకృష్ణ, దివ్యాంగుడు, సూళ్లూరుపేట

### పొలానికి దారి కల్పించండి



అయ్యా.. నాకు చంద్రగిరి మండలం భీమవరం రెవెన్యూ లెక్కదాఖల్లో 56సెంట్ల భూమి ఉంది. అక్కడికి వెళ్లే దారిని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మా పొలాలకు హద్దులు చూపడంలేదు. మీరైనా కనికరించి హద్దులు చూపించండి.

- చల్లా రవి, కందులవారిపల్లి చంద్రగిరి మండలం

### వికలత్వ సర్టిఫికెట్ మంజూరు చేయండి



మా అబ్బాయి గోవర్ధన్‌కు రెండేళ్ల క్రితం నరాల బలహీనత ఏర్పడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం కనిపించడం లేదు. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. డిజేబులిటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలి.

- నాదముని, తొండవాడ, చంద్రగిరి మండలం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు - ఆందోళన చేస్తున్న అఖిల భారతీయ జనసంఘ్ నాయకులు

### ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

వేదాంతపురం పంచాయతీ రాందాసు కాలనీలోని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి స్థలం చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో భూకబ్జాలను ప్రోత్సహించే అధికారులను కఠినంగా శిక్షించాలని అఖిల భారతీయ జనసంఘ్ నేతలు సుధాకర్ చౌదరి, రమణారెడ్డి, విజయశంకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

### మూడు చక్రాల వాహనం మంజూరు చేయండి



వికలత్వం కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాం. హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నాం. వికలత్వ కోటాలో మూడు చక్రాల మోటారు వాహనాన్ని మంజూరు చేసి ఆదుకోండి.

- జయశంకర్, జన్‌సుందర్‌రాజు, మదనంబేడు, సత్యవేడు

## సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- డయల్ యువర్ సీఎండీకి 70 వినతులు



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపకుండా చర్యలు చేపట్టాలని సీఎండీ శివశంకర్ ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ' కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజ్ సమస్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యం, కాలిపోయి, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలి, విద్యుత్ లైన్లు మార్చు చేయాలంటూ.. వివిధ సమస్యలపై 70 వినతులు వచ్చాయన్నారు. వీటిలో కర్నూలు నుంచి 18, కడప 13, అనంతపురం 15, నెల్లూరు 3, శ్రీసత్యసాయి3, చిత్తూరు1, తిరుపతి11, నంద్యాల 6 చొప్పున ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తెస్తే ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎన్.శోభావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

## ఈతకెళ్లి యువకుడి మృతి



ఈశ్వరయ్య(ఫైల్‌ఫొటో)

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపాళెంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గొల్లపాళెం గ్రామానికి చెందిన విన్నమాల ఈశ్వరయ్య(37) సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మహాలక్ష్మమ్మ దేవాలయం పక్కన ఉన్న గుంటలో ఈత కొట్టేందుకు దిగాడు. బయటకు రాకపోవడంతో స్థానికులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బాలిరెడ్డిపాళెం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

## హామీ అమలు చేసేవరకు పోరాటం



విద్యాసంస్థల బంద్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు చేసేవరకు శాంతియుతంగా పోరాటం సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు రిలే దీక్ష నిర్వహించారు. సీపీఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దీక్షకు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను గుర్తించిన చంద్రబాబునాయుడు, లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, తీరా జిల్లాల పునర్విభజనలో తుది ముసాయిదాలో ఈ అంశాన్ని చేర్చకపోవడంతో అన్యాయమన్నారు. గూడూరును నెల్లూరులో కలపాలని, లేనిపక్షంలో జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో ఈ నెల 10వ తేదీన జేఏసీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్, బాలకృష్ణంరాజు, శంకర్‌రెడ్డి, ప్రభాకర్, మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్ కుమార్, మణి, చంద్రమోహన్, నిరంజన్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లికార్జున, శరత్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళమిచ్చిన దాతలు

తిరుమల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన భక్తవత్సలం, పీ చిరదీప్ కృష్ణ, ఉమా మహేశ్వరి ఈ విరాళాన్ని ఆదివారం తిరుమలలోని దాతల విభాగంలో అందజేశారు.

### దామానెల్లూరు సచివాలయ

## ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు ఎంపీడీవో మురళీకృష్ణ ఎట్టకేలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 30న తుఫాన్ సమయంలో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో ఆ గ్రామ పరిశీలనకు వెళ్లగా ఈ విషయం బటయపడింది. దీనిపై ఈనెల 1వ తేదీన 'విపత్తు వేళా.. విధుల్లో ఉండరే!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం అయింది. దీంతో జిల్లా అధికారులు ఆరా తీసి చర్యలకు ఆదేశించారు. అయితే మండలస్థాయి అధికారులు మీనమేషాలు లెక్కించడంతో జిల్లా అధికారులు మరోమారు ఎంపీడీవోను హెచ్చరిండంతో పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బందికి సోమవారం సాయంత్రం వాట్సప్ గ్రూపులో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే సోమవారం 8వ తేదీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, ఈ నెల 3వ తేదీ ఇచ్చినట్లు పేర్కొనడం గమనార్హం. అందులోనూ ఐదు రోజుల ముందు తేదీ వేసి రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

### సాయుధ దళాల పతాక దినోత్సవానికి

## విరివిగా విరాళాలివ్వండి



సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళం అందజేస్తున్న కలెక్టర్

తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారంరాత్రి కలెక్టరేట్‌లో ఆయన తన వంతు సాయంగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమాధికారి కేవీ రాఘవులు, మాజీ సైనిక సంఘ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, ఆనందరెడ్డి, కేశవ, జయప్రకాష్‌రెడ్డి, జయప్రకాష్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్లకు యువ ఎస్ఐలు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్లకు యువ ఎస్ఐలు వచ్చారు. 30 మంది పీఎస్ఐలను వివిధ స్టేషన్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐలుగా పనిచేసిన కొందరిని వీఆర్‌కు, స్పెషల్ బ్రాంచ్‌కు, డీసీఆర్‌బీకి నియమించారు. తిరుపతిలో ఈస్ట్ పోలీసు స్టేషన్‌కున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ముగ్గురు ఎస్ఐలను నియమించారు. వడమాలపేటకు ధర్మారెడ్డి స్థానంలో నూతన ఎస్ఐను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కాగా, యువ ఎస్ఐలు సోమవారం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ వారికి సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్టతను ప్రజల్లో ఇనుమడింపచేయాలని ఆదేశించారు. ఫ్రెడ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమాజంలో అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని అన్నారు.

## నేటి ఎస్వీయూ డిగ్రీ పరీక్షల రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మంగళవారం నిర్వహించాల్సిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌తో పాటు డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రద్దయ్యాయి. సాంకేతిక కారణాలతో ఈ పరీక్షలను రద్దు చేసినట్లు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు, పరీక్షా కేంద్రాలకు ఎస్వీయూ పరీక్షల విభాగం సమాచారాన్ని పంపింది. బుధవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా ఉంటాయని సీఈ రాజమాణిక్యం తెలిపారు.

# శ్రీసిటీలో సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై సదస్సు





సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

సత్యవేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై ఉన్నత స్థాయి సమావేశం సోమవారం శ్రీసిటీలో జరిగింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై చర్చించారు. పి.కృష్ణయ్య, ఇతర ప్రతినిధులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, శ్రీసిటీ అమలు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్(3ఆర్) విధానాల ప్రాధాన్యతను, నిబద్ధతను వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ జీరో వ్యర్థలక్ష్యాలను ప్రస్తావిస్తూ.. స్కోర్ పోర్టల్‌ను వినియోగించుకుని శ్రీసిటీ ప్రాంతంలో 3ఆర్ పద్ధతులను మరింత బలోపేతం చేయాలంటూ పరిశ్రమ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. శ్రీసిటీ సుస్థిర పర్యావరణహిత కార్యక్రమాలను ప్రశంసించిన కృష్ణయ్య, ఈతరహా ఏకో సిస్టమ్‌ని అభివృద్ధి చేయడంలో ఇతర పారిశ్రామిక కేంద్రాలకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పారిశ్రామిక ఉప ఉత్పత్తులను రీసైకిల్, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యుత్తమ పద్ధతులుగా పేర్కొన్న ఆయన, వ్యర్థ నిర్వహణ ఏజెన్సీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పచ్చదనం పెంపును శ్రీసిటీ పరిశ్రమలు బాధ్యతగా స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ సుస్థిరత ప్రణాళికను ప్రస్తావిస్తూ భవిష్యత్తుకు 3ఆర్ పద్ధతులు అనివార్యమని ఉద్ఘాటించారు. ఉపాధిసృష్టి, కాలుష్యనియంత్రణ మధ్య సమతుల్యతను పరిశ్రమలు పాటించాలని, ఇందుకోసం రెగ్యులర్ ఆడిట్లు, పర్యవేక్షణ అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని వివరిస్తూ సర్క్యులర్ పార్కులు, 3ఆర్ సెంటర్లు, ప్లాస్టిక్ నిషేధం, చెత్త నిర్మూలన, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు వంటి పలు కార్యక్రమాలు ఇందులో భాగంగా పేర్కొన్నారు. ఈ విధానం 2025 ఆగస్టులో రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందిందన్నారు. అన్ని రంగాల్లో 3ఆర్ సూత్రాల ప్రాతిపదికగా వ్యర్థాలను వనరులుగా మార్చి అమలు చేయడం ఈ విధానం లక్ష్యంగా వివరించారు. తన సందేశంలో ఏపీపీసీబీ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగంపై సమగ్ర విధానాన్ని రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టిని, నాయకత్వాన్ని కొనియాడారు. సర్క్యులర్ ఎకానమీ సూత్రాల ఆచరణ, సుస్థిర పారిశ్రామిక ప్రగతి అంశాలలో శ్రీసిటీ కీలకపాత్ర పోషిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ సభ్యుడు నాగేశ్వరరాజు, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్‌తో పాటు ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల నుంచి వంద మందికిపైగా మానవ వనరులు, పర్యావరణం, ఆరోగ్య, భద్రత మేనేజర్లు హాజరయ్యారు. సమావేశంలో వివిధ సమస్యలు, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల శుద్ధి వంటి అంశాలపై చురుకైన చర్చలు సాగాయి.

# వైకుంఠ ఏకాదశికి సమన్వయంతో పనిచేయాలి



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిలోని కమాండ్ కంట్రోలు యూనిట్‌లో సోమవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. తిరుమలకు భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, లైన్ మేనేజ్‌మెంటు, అత్యవసర స్పందన బృందాల నియామకం, పాదచారి మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా ప్రత్యేక హెల్ప్ డెస్కులు, చైల్డ్ మిస్సింగ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

# పుష్కరిణి.. పులకింత

## ఆహ్లాదకంగా గడుపుతున్న ప్రజలు



వైష్ణవ కోనేరులో రంగు చేపలకు ఆహారం వేస్తున్న చిన్నారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని కోనేర్లు నిండు జలాలతో కళకళలాడుతున్నాయి. పుష్కరిణిల వద్ద భక్తులు, స్థానికులు ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని భరద్వాజతీర్థం కోనేరులో ఇటీవల కురిసిన వర్షాలతో నిండుగా నీరు చేరింది. ఇక్కడ పచ్చని చెట్లు, ఉద్యానవనంగా సేద తీరే పరిసరాలతో పాటు నీటిపై సంచరించే బాతులు ఆకర్షిస్తున్నాయి. ముక్కంటి ఆలయానికి విచ్చేసే భక్తులతోపాటు స్థానికులు సాయంత్రం వేళ సరదాగా భరద్వాజ తీర్థం వద్దకు చేరుకుని ఉల్లాసంగా గడుపుతున్నారు.

### భారీ రంగు చేపలు

శ్రీకాళహస్తి పట్టణం జయరామరావువీధిలోని వైష్ణవ పుష్కరిణిలో భారీ రంగుచేపలు పిల్లలు, పెద్దలను మైమరిపిస్తున్నాయి. వర్షాలకు పుష్కరణి నిండుగా మారడంతో సాయంత్రం వేళ చేపలకు ఆహారం వేసేందుకు పిల్లలు, పెద్దలు పుష్కరిణి వద్దకు చేరుకుని పులకిస్తున్నారు. ఐదేళ్ల కిందట కోనేరు ఎదురుగా ఉన్న ఓ అక్వేరియం షాపు నిర్వాహకుడు రంగు చేపలను పుష్కరిణిలో వదిలారు. అవి పెరుగుతూ వాటి సంతతిని వృద్ధి చేశాయి. దాంతో ఎక్కడా లేని విధంగా ఈ కోనేరులో వర్షాకాలంలో భారీ రంగు చేపలు గోల్డ్‌ఫిష్, వైట్, బ్లాక్ చేపలు ఆకర్షిస్తున్నాయి. ఇక, నారదపుష్కరణి కూడా నిండుకుండలా కనువిందుచేస్తోంది. ఉదయం, సాయంత్రం కోనేరులో స్థానికులు సేద తీరుతున్నారు.



భరద్వాజతీర్థం వద్ద సందడిగా..

# అర్హులకే పింఛన్

**● దళారులను నమ్మి మోసపోకండి ● కలెక్టర్ సుమిత్‌కుమార్**



దివ్యాంగుల వద్ద అర్జీలను తీసుకుంటున్న కలెక్టర్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలను అందిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. , దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా కొంతమంది దివ్యాంగులు సంఘ నేతలతో కలిసి పింఛన్లు, ఇంటి స్థలాలు, పరికరాలను పంపిణీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నినాదాలు చేశారు. వారి వద్దకు కలెక్టర్ స్వయంగా వచ్చారు. దివ్యాంగులను కూడ పెట్టుకుని ఎండలో నినాదాలు చేయించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల చాలా మంది సంఘాల పేర్లతో దివ్యాంగులకు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను తొలగిస్తామని డబ్బులు తీసుకుంటున్నారనే తమకు ఫిర్యాదులు అందాయని కలెక్టర్ చెప్పారు. ఇది సరికాదన్నారు. ఆరు దశల్లో దివ్యాంగుల పరిశీలన జరుగుతుందన్నారు. అనర్హులుంటే తొలగిస్తామన్నారు. అనంతరం దివ్యాంగుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అలాగే 370 మంది వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. పీజీఆర్ఎస్ సందర్భంగా అధికారుల దృష్టికి వచ్చిన అర్జీలలో కొన్ని..

● వెదురుకుప్పం మండలం బొమ్మాయిపల్లె పంచాయతీ ప్రజలు తమ గ్రామ పంచాయతీ విభజన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. తమ పంచాయతీని బొమ్మాయిపల్లె, దేవళంపేట పేరుతో విభజించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బొమ్మాయిపల్లె పంచాయతీ పూర్తిగా వెనుకబడి పోతుందన్నారు. పంచాయతీ అభివృద్ధి దృష్ట్యా యథాతథంగా ఉంచాలని కోరారు.

● వీకోట మండలంలోని తోటకనుమ-కర్ణాటక వెళ్లేదారి వంతెనను నిర్మించాలని గ్రామస్థులు కోరారు. చెరువులో నీటి ఉధృతి పెరిగితే రాకపోకలు స్తంభించిపోతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వంతెనను నిర్మించాలని కోరారు.

● కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని పిరమలై కల్లర్ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సౌందర్‌రాజన్ కోరారు. పూర్వీకుల కాలం నుంచి జిల్లాలోనే తాము స్థిరనివాసం ఉంటున్నామన్నారు. కులధ్రువీకరణ పత్రాలను ఇవ్వక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

● పింఛన్లను మంజూరు చేసి ఆదుకోవాలని ఐరాల మండలం చిన్న కంపల్లె సచివాలయ పరిధిలో ఉన్న దివ్యాంగులు కోరారు.

● చిత్తూరు నగర పరిధిలో చెర్లోపల్లె గ్రామస్థులు తమకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరారు. తేనబండ పరిధిలోని సర్వే నెంబరు 1121, 654లలో ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇంటి స్థలాల్లేక, బాడుగలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.





పిరమలై కల్లర్ కుల ధ్రువీకరణపత్రాలను మంజూరు చేయాలని కలెక్టరేట్‌కు వచ్చిన కల్లర్ కులస్థులు - పంచాయతీ విభజన వద్దంటూ ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న బొమ్మాయిపల్లె ప్రజలు

**● పోలీసుశాఖకు 46 అర్జీలు**



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా నలుమూలల నుంచి 46 మంది బాధితులు హాజరయ్యారు. తమ అర్జీలను ఎస్పీ తుషార్‌డూడీ, ఏఎస్పీ రాజశేఖర్‌రాజులకు అందజేశారు. నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయంచేస్తామని వారు హామీ ఇచ్చారు.

## మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం



మొదలియార్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు

చిత్తూరు సిటీ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ప్రభుత్వం గత నెల ఈ కార్పోరేషన్‌లకు డైరెక్టర్లను నియమించిన సంగతి తెలిసిందే. సోమవారం విజయవాడలో డైరెక్టర్లుగా వి.గోపాలకృష్ణన్ (చిత్తూరు,టీడీపీ)ఎ.నాగరాజు (పూతలపట్టు, టీడీపీ), జి.మణికంఠ (పుంగనూరు, జనసేన), ఎం.శ్రీకాంత్ (పుంగనూరు, టీడీపీ), కె.నమశివాయం (సత్యవేడు, టీడీపీ), ఎం.మణి (కుప్పం, టీడీపీ),వినోద్ కుమార్ (కుప్పం, టీడీపీ) ఎన్ఎన్ ధనపాల్ (నగరి, టీడీపీ), ఎస్ ముత్తయ్య (నగరి, టీడీపీ), ఎన్.భాస్కరన్ (సత్యవేడు, టీడీపీ), ఎస్ఎస్ నటరాజన్ (గంగాధరనెల్లూరు, టీడీపీ) ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, పార్టీ చిత్తూరు నియోజకవర్గ పరిశీలకుడు సునీల్ కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన డైరెక్టర్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## బోయకొండ గంగమ్మ హుండీ ఆదాయం రూ.78 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.78.79 లక్షల ఆదాయం చేకూరినట్లు డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ..78,79,574 నగదు, 31 గ్రాముల బంగారు, 770 గ్రాములు వెండి, 5యూరో 2నోట్లు , 10 యూరోల నోటు ఒకటి, 20 యూరో నోటు ఒకటి, యూఎస్ డాలర్ ఒకటి వచ్చింది. ఈ కానుకలు 65 రోజుల్లో భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించారని ఈవో వివరించారు. ● అలాగే రణభేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.51,249 నగదు వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు దేవదాయ శాఖ ఏసీ చిట్టెమ్మ, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన సేవలందించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణమైన పౌర సేవలను అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో వర్చువల్‌గా అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. ఎలాంటి అలసత్వం ఉండకూడదన్నారు. పరిష్కారం చూపలేని అర్జీల గురించి అర్జీదారుడికి స్పష్టంగా వివరించాలన్నారు. పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 68, 998 వినతులు రాగా వాటిలో 58, 594 అర్జీలను పరిష్కరించామన్నారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ ఫైల్స్ దాఖలు చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలలను ప్రీ ఆడిట్ నిర్వహించాలన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్లు విజజయలక్ష్మీ, కరుణకుమారి, డీఎల్‌డీవో రవి కుమార్ పాల్గొన్నారు.

## ఆ 3 మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

నగరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరి, నిండ్ర,విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలంటూ నగరిలో సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఓంశక్తి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి ఆర్డీవో అనుపమకు వీరు వినతిపత్రం అందించారు. చిత్తూరు జిల్లాలో ఉండే తాము పిల్లల భవిష్యత్‌ను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, వైద్య, రవాణా పరంగాతమకు అనుకూలమైనది తిరుపతి జిల్లా అని పేర్కొన్నారు. . చిత్తూరు జిల్లాలో కలిపితే జిల్లా కేంద్రానికి వెళ్లాలన్న చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు ఎన్నికల సమయంలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతిజిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కోదండయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబు, మదన్‌కుమార్, వీరయ్య, మునిరత్నం, హమీద్, గోపి, రవి, అహ్మద్, ముజీబ్, సురేష్, ముత్తురాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన అను

వి.కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పదో తరగతి బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వి.కోట మండలం ముదిమడుగు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముదిమడుగు గ్రామానికి చెందిన తిమ్మరాజు కుమార్తె అను(15) వి.కోటలో 10వ తరగతి చదువుతోంది. కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండేది. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పనులపై బయటకు వెళ్లిన కుటుంబసభ్యులు ఇంటికి వచ్చే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు వి.కోట పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యలతో చనిపోతున్నట్లు బాలిక డైరీలో రాసుకున్నట్లు కుటుంబ సభ్యుల విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. బాలిక మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ఎస్వీయూ వాలీబాల్ కెప్టెన్‌గా బైరెడ్డిపల్లె వాసి



ఎస్వీయూనివర్సిటీ వాలీబాల్ కెప్టెన్‌గా ఎంపికైన గణేష్

బైరెడ్డిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా బైరెడ్డిపల్లెకు చెందిన గణేష్ ఎంపికైనట్లు బైరెడ్డిపల్లె వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీలో బి.ఎ పొలిటికల్‌సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న గణేష్ యూనివర్సిటీ కెప్టెన్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా గణేష్‌కు స్థానిక వాలీబాల్ క్రీడాకారులు పలువురు అభినందనలు తెలిపారు.

# పంటపొలాలపై ఆగని గజ దాడులు





తాళ్ళమడుగు వద్ద ఏనుగుల దాడిలో దెబ్బతిన్న వరిపంట, నాశనమైన జొన్నపంటను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

యాదమరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దుల్లో ఏనుగులే తిష్ట వేశాయి. పంటపొలాలపై దాడి చేస్తున్నాయి. బోడబండ్ల బీట్ తాళ్ళమడుగు, దళవాయిపల్లె గ్రామాల్లో ఆదివారం రాత్రి పంటలపై దాడిచేసి అరటి, మామిడి, టెంకాయ చెట్లను ధ్వంసం చేశాయి. కొన్ని రోజులుగా దళవాయిపల్లె సమీపంలోని నుంజర్ల అటవీ ప్రాంతంలో తిష్టవేసిన 13 ఏనుగుల గుంపు రాత్రి సమయంలో గుంపులుగా విడిపోయి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చేతికందే దశలో పంట నాశనమవుతుండడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. వీటి దాడిలోవరి పంట, కొబ్బరి, మామిడి, అరటి, రాగి తదితర పంటలకు అపార నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి తాళ్ళమడుగు అటవీ ప్రాంతం వద్దకు రెండుగా విడిపోయి చేరుకున్న 13 ఏనుగుల గుంపు, అదే గ్రామానికి చెందిన రైతులు మార్కండేయ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులుకు చెందిన వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలను నాశనం చేశాయి. వెస్ట్ ఎఫ్ఆర్వో పట్టాభి, ఎఫ్ఎస్‌వో మోహన్‌మురళి, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది వెళ్లి ఏనుగులు దాడిచేసిన పంటలను పరిశీలించారు. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## ఆవులపల్లె నుంచి సోమల వైపు మళ్లిన ఏనుగులు



నెలుకూరిపల్లె వద్ద ఏనుగులు విరిచేసిన కొబ్బరిచెట్లు

సోమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ నెలుకూరిపల్లె వద్దకు ఆదివారం రాత్రి చేరుకున్న మూడు ఏనుగులు కొబ్బరి, వరి, మామిడి తోటల్లో సంచరించి పంటలను తొక్కివేశాయి. ఆవులపల్లె పంచాయతీలో గత పది రోజులుగా రైతుల కంటిమీద కునుకు లేకుండా చేసిన ఏనుగులు సోమల వైపు రావడంతో ఇక్కడి రైతులు భయపడుతున్నారు. సోమలకు చెందిన పోలూరు చలపతి, శ్రీని వాసులు కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. నెలుకూరిపల్లెకు చెందిన నరసింహులు, చలపతి వరిపంటను తొక్కేశాయి. నెలుకూరిపల్లెకు అతి సమీపంలోనే ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులు భయపడుతు న్నారు. కొబ్బరి, సపోటా చెట్లలో తిరగాడిన ఏనుగులు పీవీసీ పైపులైన్లను తొక్కివేశాయి. మధురమల్లై కొండ వైపు మూడు ఏనుగులు వెళ్లినట్లు రైతులు తెలిపారు. సోమవారం మధురమల్లై కొండలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసేందుకు భక్తులు వెళ్లకుండా తిరుగుముఖం పట్టారు.

## 14 నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈ నెల 14నుంచి నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీవరకూ జరిగే ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులకు విద్యుత్ పొదుపుగా ఎలా వాడాలో అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇంధన పొదుపు ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నేడు జిల్లా డ్రగ్ కంట్రోలింగ్ అధికారి కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అవరణలో నిర్మించిన జిల్లా డ్రగ్ కంట్రోలింగ్ అధికారి కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించనున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన ఈమేకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

## కరాటేలో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



పుంగనూరు రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో పుంగనూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ మహేశ్ తెలిపారు. ఆదివారం నంద్యాల జిల్లా బనగానిపల్లెలో ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో పుంగనూరుకు చెందిన వి.సహశ్రీ, జె.ఫాతిమా, పవిత్ర, రిత్విక్, కార్తికేయ, కుమార్‌రెడ్డి, నవనీత్‌రెడ్డి, శిరీషా, మోహిత్, వికాష్, దేవాన్ష్, హీషాన్, జీవన్‌కుమార్ బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్ కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేట్ చైర్మన్ రామాంజులు, సీఐ ప్రవీణ్‌కుమార్, బనగానిపల్లె మాజీ సర్పంచ్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## విజలాపురం కేజీబీవీ చైర్‌పర్సన్ మృతి



భాగ్యలక్ష్మికి నివాళులర్పించి, లోకేశ్‌ను పరామర్శిస్తున్న గౌనివారి, పీఎస్ఎం, ఇన్‌సెట్‌లో భాగ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పది రోజులక్రితం కర్ణాటక రాష్ట్రం తాయలూరు సమీపంలో ద్విచక్రవాహనం నుంచి జారి పడి గాయపడ్డ రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లెకు చెందిన టీడీపీ నేత లోకేశ్ భార్య విజలాపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ ఆదివారం సాయంత్రం మృతిచెందారు. ప్రమాదానికి గురైన రోజు ఆమెను తొలుత ముళబాగల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కోలారు ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల క్రితం కాస్త కోలుకున్న ఆమెను కుటుంబసభ్యులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతిచెందారు. సోమవారం మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్‌మునిరత్నం స్థానిక నేతలతో కలిసి భాగ్యలక్ష్మీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. లోకేశ్‌ను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు జయశంకర్, యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, సాగునీటి సంఘం చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నాగభూషణం, నేతలు బీరప్ప, కేశవులు, గోపీ, మంజునాథాచారి, శీనప్ప, మణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బద్రీనారాయణకు పలువురి నివాళులు



బద్రీనారాయణకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు డీకే బద్రీనారాయణకు పలువురు నేతలు నివాళులర్పించారు.శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన బద్రీనారాయణకు అమెరికాలో వున్న కుమార్తె వచ్చాక సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.చిత్తూరులోని బీవీ రెడ్డి కాలనీలో వున్న బద్రీనారాయణ నివాసం నుంచి ఆయన మృతదేహాన్ని స్వర్గరథం వాహనంలో తీసుకువెళ్ళి మహాసముద్రం టోల్‌గేట్ వద్ద వున్న ఆయన ఫాం హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. చిత్తూరు, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, జేఎంసీ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, డీఏ శ్రీనివాస్, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, వసంతకుమార్,పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాదం,గోసంరక్షణకు రూ.10 లక్షల విరాళం



రూ.పది లక్షలు విరాళంగా అందిస్తున్న ఉమాదేవి

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నప్రసాదం, గోసంరక్షణ ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన సిద్ధారెడ్డి ఉమాదేవి, సిద్ధార్థనివేదిత సోమవారం రూ.10లక్షలను విరాళంగా అందజేశారు. రాజమండ్రికి చెందిన గోపాలకృష్ణారావు గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష, నిత్యాన్నప్రసాదానికి చిత్తూరుకు చెందిన ఇంద్రాణి రూ.1,00,116 అందజేశారు.

## సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపులపై హోం మంత్రి ఆరా

తిరుపతి(నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపుల కేసు దర్యాప్తు పురోగతిపై సోమవారం హోం మంత్రి అనిత ఆరా తీశారు. ఆమె ఎస్పీ సుబ్బరాయుడితో మాట్లాడారు. 'ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేశాం. దర్యాప్తు అధికారిగా డీఎస్పీ భక్తవత్సలంను నియమించాం. బాధితురాలి వాగ్మూలం తీసుకోవడానికి డీఎస్పీ ఆధ్వర్యంలో వెస్ట్ సీఐ మురళీ మోహన్, అలిపిరి ఎస్ఐ అజిత, మహిళా కానిస్టేబుళ్లు ఒడిశా వెళ్లారు. తిరుపతిలో దర్యాప్తు చేయడానికి మరో బృందాన్ని ఏర్పాటు చేశాం. ఇలా ఒక కేసులో రెండు బృందాలతో ముమ్మరంగా విచారణ చేపట్టాం' అని హోం మంత్రికి ఎస్పీ వివరించారు. ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం చేసి బాధితురాలికి త్వరగా న్యాయం జరిగేలా చూడాలని మంత్రి అనిత ఆదేశించారు.

## నేడు షిర్డి రైలు ప్రారంభం

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-షిర్డీ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలును మంగళవారం ఢిల్లీనుంచి కేంద్ర మంత్రి సోమన్న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి తిరుపతి కార్యక్రమంలో పాల్గొంటారని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు ఈ ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లను సోమవారం గుంతకల్లు అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ పరిశీలించారు.

## ఆపన్నులకు అండగా సీఎంఆర్‌ఎఫ్



శాంతమ్మకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

రామకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) అండగా నిలుస్తోందని టీడీపీ ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం మిట్టపల్లెకు చెందిన శాంతమ్మకు రామకుప్పం పార్టీ కార్యాలయంలో రూ.50994 విలువైన చెక్కును వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యాల బారిన పడి, ఆర్థికంగా చితికిపోయిన ప్రతి కుటుంబానికీ సీఎం చంద్రబాబు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందించి దన్నుగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కడా పీఏసీ సభ్యుడు రఘు, నేతలు వీరనాగప్ప, రంగనాగరాజు, బాలకృష్ణలు పాల్గొన్నారు.

## మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం



రామకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గానికి చెందిన టీడీపీ యువనేతలు చెక్కునత్తం మణి, వినోద్‌లు సోమవారం అమరావతిలోని బీసీ భవన్‌లో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పదవీ ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు వెంకటరమణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో రామకుప్పం, కుప్పం మండలాల నేతలు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగుయువత రామకుప్పం మండల అధ్యక్షుడు బాలకృష్ణ, ఐ-టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్, శాంతిపురం మండల ప్రధానకార్యదర్శి మంజునాథ్, నాయకులు అల్లీ శీన, సుబ్బు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్‌ఎస్‌లో వినతుల జోరు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

సోమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ ఎస్‌కు అధిక సంఖ్యలో వినతులు తహసీల్దార్ మధు సూదన్‌కు అందజేశారు. వల్లిగట్లలో అన్నదమ్ముల భూ పరిష్కారంలో వివాదాలు నెలకొన్నాయని వాటిని పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. పేగల వారిపల్లెలో అతి పురాతన శివాలయం ఆవరణంలోని భూమిని కొందరు ఆక్రమించు కునేందుకు ప్రయత్నిస్తురని, ప్రభుత్వ భూములను ఆక్రమించు కుంటు న్నారని గ్రామస్తులు తెలిపారు. పలువురికి వన్‌బీలో నెంబర్లు సక్రమంగా లేవని వాటిని సరిచేయాలని వినతులు అందజేశారు. అటవీ, రెవెన్యూ శాఖ సరిహద్దు భూములు వివాదంలో ఉన్నాయని ఆ శాఖలు సంయుక్త సర్వేతో పరిష్కరించాలని కోరారు. అనంతరం వీఆర్వోలతో తహసీల్దార్ సమీక్షించి వినతులపై క్షేత్ర సందర్శనలతో పరిష్కరించాలని ఆదేశించారు.

## ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



సుబ్రహ్మణ్యం - ఇలియాజ్

వి.కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్టీయూ ఉపాధ్య క్షుడిగా సుబ్రహ్మణ్యంను జిల్లా ఎస్టీయూ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సోమవారం చిత్తూరులోని ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వి.కోట చెందిన సుబ్ర హ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.కోటకు చెందిన షేక్ ఇలియాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా జయప్ప, తారకనాత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ జిల్లా విభాగంలో అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా పదవులకు వి.కోట నుంచి ఎన్నికైన ఇలియాజ్, సుబ్రహ్మణ్యంలను మండల కమిటీ అభినందించింది.

## రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులకు సన్మానం



చౌడేపల్లె, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు చారాల హైస్కూల్ హెచ్‌ఎం రేణుక సన్మానం చేశారు. చారాల హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని అర్చన ఇటీవల జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్టులో ఉత్తమ ప్రతిబ కనపరిచింది. అలాగే అండర్-14 బాలుర విభాగంలో చారాల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి అనిల్‌కుమార్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిబ కనపరిచాడు. ఈ క్రమంలో వారిని ఉపాధ్యాయులు శాలువలతో ఘనంగా సన్మానించారు. పీఈటీ రాజేంద్రబాబు, ఉపాధ్యా యులు, సహదేవయ్య సుబ్రహ్మణ్యం, కొండయ్య, ప్రతిమ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మోర్చా అధ్యక్షురాలుగా కవితరాజు

వి.కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కవితరాజు ఎంపికయ్యారు. బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు

సదుం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల నుంచి ఎరువుల కోసం మండల రైతులు వ్యయప్రయాసలు పడుతున్నారు. ప్రస్తుతం రైతులు వరినాట్లు వేస్తున్నారు. బయట మార్కెట్లో రైతులకు యూరియా అందుబాటులో లేదు. దీంతో రైతు సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం మండలంలోని నడిగడ్డ పంచాయతీ కేంద్రానికి యూరియా సరఫరా అయ్యిందని తెలుసుకున్న రైతులు సోమవారం యూరియా కోసం భారీగా తరలివచ్చారు. పలు పంచాయతీల నుంచి పెద్దసంఖ్యలో రైతులు రావడంతో ఇటు సిబ్బంది, అటు రైతులు ఇబ్బందులు పడ్డారు.



నడిగడ్డ రైతు సేవా కేంద్రం ముందు నిరీక్షిస్తున్న రైతులు

## ఈ- సైకిళ్ల కోసం రిజిస్టర్ చేసుకోండి

పెద్దపంజాణి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం రాయితీ ధరలో ఈ-సైకిళ్లను పంపిణీ చేస్తుందని కావాల్సిన వారు రిజిస్టర్ చేసుకోవాలని ఎంపీడీవో బాలాజీ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ద్విచక్ర వాహనాల పెట్రోలు ఖర్చు రోజు రోజుకూ పెరుగుతుండడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ సైకిళ్లను వాడాలని కోరారు. ఒక యూనిట్ చార్జింగ్‌తో దాదాపు 40 కిలో మీటర్లు ప్రయాణించవచ్చునని వివరించారు. ఈ- సైకిల్ ధర రూ.34,999 ఉండగా ప్రభుత్వం రాయితీలో రూ.23,999లకు అందిస్తుందని తెలియజేశారు. ఆసక్తి గల వారు ఆయా గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో మీపేరును నమోదు చేసు కోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక సచివాలయంలో సంప్రదించాలని కోరారు. డిసెంబరు 10వ తేదీ లోపు పేరును నమోదు చేసుకుంటే జనవరి 2026 రెండవ వారంలో సైకిళ్ల పంపిణీ చేస్తారని తెలియజేశారు.

## సోమేశ్వరస్వామికి విశేషపూజలు



బైరెడ్డిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో కొలువైన సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు నాగేంద్ర స్వామివారికి అభిషేకం చేసి విశేషాలంకరణతో ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శ్మశానానికి స్థలం కేటాయింపు



కుప్పం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వానగుట్టపల్లె పంచాయతీ జంపనూరు గ్రామంలో శ్మశానం కోసం అధికారులు 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ప్రజల వినతుల మేరకు తహసీల్దార్ చిట్టిబాబు స్పందించి సర్వే చేసి స్థలాన్ని అప్పగించారు. ఈ స్థలానికి సంబంధించిన పట్టాను సోమ వారం టీడీపీ మండల అధ్యక్షుడు రాజగోపాల్ గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పార్వతి రామచంద్ర, నాయకులు శివకుమార్, గోవిందరాజు, గోపాల్ గౌడ్, రవి, రిజ్వాన్, షరీఫ్, పలని, ఉపేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భువనేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో సిద్దరామయ్య

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు జ్ఞానాన్ని అందించేడమే కాకుండా విద్యార్థుల ఆలోచనా శక్తిని పెంపొందిస్తూ చురుకైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల ఎంఈవో కార్యాలయంలో సోమవారం బోధన విధానంలో ఉపాధ్యాయుల పాత్ర, సంసిద్ధత నాణ్యత, సామాజిక అంశాలపై రెండు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. హెచ్‌ఎంలు శ్రీవాణి, హరిశంకర్, ఫజురుల్లా, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోమలలో శ్రీవారి విహారం



సోమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల నేపథ్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పుష్పపల్లకిలో భూనీలాదేవి సమేత శ్రీవారిని సుందరంగా అలంకరించి బాణసంచా వేడుకలు, డప్పు కళాకారుల నృత్యాల నడుమ ఊరేగిరాగా మహిళలు ఇంటింటా కర్పూర నీరాజనాలతో ఉత్సవర్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పాగొండ వేణుగోపాల్, మోహన్ బాబు, ప్రసాద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయదారులు శ్వేత, డాక్టర్ ప్రదీప్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# అభివృద్ధికి చిరునామా కుప్పం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం అభివృద్ధికి చిరునామాగా మారిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీ 22వార్డు పరిధిలోని గుడుపల్లె కూడలి నుంచి గుడుపల్లె మండలం పెద్దపర్తికుంట గ్రామం వరకు రూ.5.16కోట్లతో నూతనంగా మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా చేసేందుకు పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఒక వైపు పరిశ్రమలు, మరోవైపు హంద్రీ-నీవా కాలువ ద్వారా నీళ్లు తీసుకొచ్చారన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభించి, యువత భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నారని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు మాస్టర్ ప్లాన్ అమలు జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకొంటున్నామని ఆర్డీఓ పి.భవాని పేర్కొన్నారు. సోమ వారం పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పలు మండలాల నుంచి వచ్చిన రైతుల నుంచి వినతులు స్వీక రించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన వినతులపై వెంటనే సంబంధిత తహసీల్దార్లకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

# పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న డీవీమునిరత్నం

పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన నెల్లూరుకు చెందిన ప్రజా కళాకారుడు పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డీవీ.మునిరత్నం, కార్యదర్శి మణి డిమాండు చేశారు. సోమవారం వారు ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గంజాయిని సమూలంగా నిర్మూలించాలని కోరారు. ఈ సమావేశంలో సరస్వతి, అనసూయ, పార్థసారథి, నారాయణశెట్టి, గుర్రం సుబ్రహ్మణ్యం, ఆనంద, అమానుల్లా, సూర శ్రీనివాసులు, శాంతమ్మ, జగదీశ్వరి, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై ఉలవల పంపిణీ



రాజుపల్లె పంచాయతీలో ఉలవలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెద్దపంజాణి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు రాయితీ ధరలో ఉలవలు పంపిణీ చేస్తోందని మండల వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. మండలంలోని 19 రైతు సేవా కేంద్రాలలో 200 క్వింటాళ్ల ఉలవల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. సోమవారం మండలంలోని రాజుపల్లె, పెద్దవెలగటూరు రైతుసేవా కేంద్రాలలో ఉలవలు పంపిణీ చేశారు. మంగళవారం నుంచి అన్ని రైతు సేవా కేంద్రాలలో పంపిణీ చేస్తామని, విత్తన శుద్ధిచేసిన ఈ విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వింటాలు ధర రూ.5600 కాగా ప్రభుత్వం 80 శాతం రాయితీపై రూ.4480లకు అందిస్తోందన్నారు. 10 కేజీల బ్యాగు రూ.120లకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్ర సహాయకులు చంద్రనాయక్, మండల టీడీపీ నాయకులు భానుప్రతాప్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మహేష్, చందుయాదవ్, వరదారెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు బాలక్రిష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది శ్రీకాంత్, పద్మనాభరెడ్డి తదితరులు ఉన్నారు.

# నిజమైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బీజేపీ నాయకులు అయూబ్ ఖాన్, నరసింహులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. పట్టణ చుట్టు పక్కల ఇళ్ల స్థలాల కోసం వందల ఎకరాలు ప్రభుత్వాలు సేకరించినా నిజమైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ కాలనీల్లో రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులకు ఒక్కొక్కరికి 10 నుంచి 20 వరకు ఇళ్ల స్థలాలు ఉన్నాయని వాటిని పరిశీలించి ఆక్రమణలకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని విన్నవించారు. పట్టణంలో నిజమైన పేదలకు ఆ స్థలాలను ఇవ్వాలన్నారు.

# సులభ రీతిలో బోధించాలి



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈవోలు

పుంగనూరు రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభమైన పద్ధతిలో విద్యను బోధించాలని ఎంఈవో నటరాజరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో మండలంలోని ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో అభ్యాస వాతావరణం, పాఠ్యాంశాల నిర్వహణ, విద్యార్థులలో సహకార గుణాలు పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డెప్పశెట్టి, శిక్షకులు నారాయణస్వామి, గంగాధర్, హెచ్‌ఎంలు మహేశ్‌నారాయణ, ఇంద్రాణి, బాలసుబ్రహ్మణ్యం, రెడ్డెమ్మ, రియాజ్‌ఉన్నీషా, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యం స్వామి ఆలయ హుండీలో చోరీ



హుండీ తాళం పగలగొట్టిన దుండగులు

సదుం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సదుం గార్గేయ నదిపై కొలు వైన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణంలో ఉన్న మరకత లింగేశ్వర స్వామి ఉప ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ట్రస్టు ఛైర్మన్ నాలి కృష్ణారెడ్డి అందించిన సమాచారం మేరకు గత శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం ముందు తలుపు వేసిన తాళాలను పగలగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీని పగలగొట్టి సుమారు రూ.40 వేలు దోచుకెళ్లారు. ఎస్‌ఐ షేక్ షావలి, క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా ఇటీవలి కాలంలో మండల పరిధిలోని చెరుకువారిపల్లె, బూరగమంద, రామాపురం, రెడ్డివారిపల్లె గ్రామాల్లో గల ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. వరుస దొంగతనాలపై ఆలయాల నిర్వాహకులతోపాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యాప్రమాణాలు పెంపొందించండి

రొంపిచెర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందిం చేలా పని చేయాలని (అబ్జర్వర్) డైట్ సెంటర్ లెక్చరర్ మునిచంద్ర సూచించారు. సోమవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ పై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుల బోధనలు పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచ్ టూల్ విద్యార్థులకు చాలా ఉపయోగ కరమైనద న్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రోగ్రామ్ ఎప్పటికప్పుడు పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, మండలంలోని ప్రధానోపాధ్యా యులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ఎనలేని కృషిచేసిన సీఎం చంద్రబాబు దివ్యాంగుల పాలిట దేవుడయ్యారని ఉమ్మడి జిల్లా టీడీపీ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఇర్షాద్, మండల టీడీపీ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు రెడ్డిశేఖర్ నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో సోమవారం మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఇంద్రధనస్సు పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ రుణాలు, గృహనిర్మాణ పథకంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఇళ్లు, ప్రత్యేక కళాశాల, ఎక్స్‌అఫిషియో మెంబరు, దివ్యాంగ భవన్ ఏర్పాటు చేస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించడం సంతోషమన్నారు. టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, మహేష్, రామకృష్ణమ నాయుడు, కరుణాకర్‌నాయుడు, వెంకటమునినాయుడు, సుదర్శన్ నాయుడు, ముద్దుస్వామి, అన్సర్, దివ్యాంగ సంఘం నాయకులు ఢిల్లీబాబు, రాజేష్, అన్నాచ్చి, రమేష్, రెడ్డెప్ప, బాలరాజు, బావాజాన్ పాల్గొన్నారు.



కల్లూరులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

## కాణిపాకం ఆలయ ఛైర్మన్‌కు అభినందనలు



పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : కాణిపాకం ఆలయ ఛైర్మన్‌గా నియమితులైన మణినాయుడును పలమనేరు టీడీపీ నాయకులు అభినందించారు. సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడు, చిత్తూరు పార్ల మెంట్ టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, పలమనేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ నాగరాజు, పలమనేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నదీం, గంగవరం టీడీపీ అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు హాజరై ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఫుట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం



పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎంవీఆర్ కళాశాలలో ఫైనల్ బీకాం చదువుతున్న పగడాల ప్రవీణను సోమవారం ఇక్కడి సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు శాలువకప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. పగడాల ప్రవీణ ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ఎంపికై ఈ నెల 15న చెన్నైలో జరిగే వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సన్మానం చేసినట్లు మధుమోహన్‌రావు తెలిపారు.

## ఆర్థో సర్జన్ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ ధర్మనాయక్

పుంగనూరు రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వాస్పత్రి ఆర్థో పెడిక్‌గా డాక్టర్ ధర్మనాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఉద్యోగుల నిరసనకు సంఘీభావం తెలుపుతున్న డీసీసీ బ్యాంకు సిబ్బంది

సదుం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సదుం సహకార సంఘం సిబ్బంది కోరారు. సోమవారం సదుం సహకార సంఘం సీఈవో వసుపులేటి రమణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక డీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ధనమ్మకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని హామీ ఇచ్చారు.

## వ్యవసాయశాఖ కమిషనర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ ఛైర్మన్



కమిషనర్‌తో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ శమీపతియాదవ్

పుంగనూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ కమిషనర్ విజయ్‌సునీతను గుంటూరులో పుంగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ శమీపతియాదవ్ కలిశారు. సోమవారం గుంటూరులోని వ్యవసాయ కమిషన్ కార్యాలయంలో ఆమెను కలసి పుంగనూరు మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. చింతపండు నిల్వ చేయడానికి షెడ్లు అవసరమని, ప్రస్తుతం ఉన్న టమోటా షెడ్లు మరమ్మతులు గురైనట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## పాఠశాలకు కుర్చీల వితరణ



తవణంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నేడుపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలకు గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ నిషార్‌బాషా తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం రూ.15 వేల విలువ గల కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే మొక్కలు నాటాలని, నీటిని వృథా చేయరాదని, సమయపాలన పాటించాలని పిల్లలకు హితవు పలికారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరిస్తాం

శ్రీరంగరాజపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కర వేదికలో వచ్చిన సమస్యలను పరిష్కారిస్తామని తహసీల్దార్ లోకనాథం పిళ్లై చెప్పారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంల పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 21 అర్జీలు వచ్చాయన్నారు. అరింటిని అక్కడికక్కడే పరిష్కరించామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ త్యాగరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న వెంకట్రామయ్య

చిత్తూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు రాసాని వెంకట్రామయ్య మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పత్రికల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు సౌకర్యాలను పరిశీలించారు. కొత్త గ్రంథాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయన వెంట డిప్యూటీ లైబ్రేరియన్ గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు



వర్షానికి దెబ్బతిన్న రోడ్డును బాగు చేస్తున్న దృశ్యం

శ్రీరంగరాజపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ కారణంగా ఎగువకమ్మకండ్రిగ-పుల్లూరు మధ్య పెద్దవంక పొంగి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులపై అధికారులు దృష్టి పెట్టారు. నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వీరి ఇబ్బందులను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి టీడీపీ బూత్ కన్వీనర్ వెంకటేష్ నాయుడు తీసుకెళ్లారు. ఆయన స్పందించి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కలసి సమస్యను నివేదించారు. వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత సిబ్బందికి ఆదేశాలిచ్చారు. వేగంగా జరుగుతున్న ఈ పనులను సోమవారం బూత్ కన్వీనర్ వెంకటేష్ నాయుడు పరిశీలించారు. సమస్యను పరిష్కారానికి చొరవ చూసిన ఎమ్మెల్యేకి, కలెక్టర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పల్స్ పోలియో విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో దామోదరం

వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని ఎంఈవో దామోదరం పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో ఆయన పల్స్ పోలియో కార్యక్రమంపై సమాశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 4237 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరి కోసం 32 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 21న కేంద్రాల్లో పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. 22,23 తేదిల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణచైతన్య, సీహెచ్‌వో కొప్పేటి మధుసూదన్, హెల్త్ సూపర్‌వైజర్లు ఈశ్వరి, మోహన్‌మురళీనాథ్, పట్టుబాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## రవాణా మంత్రిని కలిసిన దివ్యాంగ నేతలు



రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసిన దివ్యాంగుల నాయకులు

నింద్ర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని జిల్లా విభిన్న ప్రతిభావంతుల దివ్యాంగుల నాయకులు సోమవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల సంక్షేమానికి ప్రకటించిన పథకాలపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో దివ్యాంగులు కూర్చునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించాలన్నారు. దివ్యాంగులకు జీవనోపాధి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, చదువుకున్న దివ్యాంగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌లో విరివిగా రుణాల మంజూరు



రుణ పత్రాలను అందజేస్తున్న చిత్రానాయుడు

యాదమరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సంఘంలో రైతులకు పంటసాగుకు అవసరమైన రుణాలను మంజూరు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ చిత్రానాయుడు తెలిపారు. సోమవారం ఆమె రైతులకు రూ.3 లక్షల రుణాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సహకార సంఘం సభ్యుల సహకారంతో రుణాలు మంజూరు చేశామన్నారు. సహకార సంఘం ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, మహబూబ్ బాషా, ప్రభాకర్, సహకార సంఘం సీఈవో ఆర్.గుణశేఖర్ పాల్గొన్నారు.

## మట్టి నమూనాలపై అవగాహన

గుడిపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కూడా మట్టి నమూనాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. సోమవారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ (పీఎం సోయిల్ హెల్త్ ప్రోగ్రామ్) మట్టి నమూనాల పరీక్షపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు గణపతి, హసన్ బాషా, సంగీత, దూర్వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం



బాధితులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగంకు 2, హెల్త్‌కు 2, టిడ్కోకు 2 చొప్పున ఆరు అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్; ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఆర్వో గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

## మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజు

యాదమరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం విజయవాడ బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజులు, డైరెక్టర్లు పదవి బాధ్యతలు చేపట్టారు. యాదమరికి చెందిన నాగరాజును ప్రభుత్వం డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూమొదలియార్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మహబూబ్ బాషా, జ్యోతిమోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి టిప్పర్ బోల్తా



వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బలిజ మొండివెంగనపల్లె సమీపంలో సోమవారం అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడింది. వెదురుకుప్పం నుంచి చంద్రగిరి వైపు కంకర తరలిస్తుండగా బలిజ మొండివెంగనపల్లె వద్ద ఈ టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

## బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



లక్ష్మీనారాయణకు చెక్కు అందజేస్తున్న అతిథులు

నగరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి నారాయణ పాఠశాలకు చెందిన లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు ఆ కళాశాల అధికారి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, వేలూరు జిల్లాలో గల నారాయణ పాఠశాలకు చెందిన సుమారు పదివేల మంది పోటీల్లో పాల్గొన్నారు. క్యారమ్స్, హైజంప్ విజేతలకు మెడల్స్ అందించగా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి లక్ష్మీనారాయణకు మూడువేల చెక్కును ఎన్‌టీ.వీవీజీవో రాంకుమార్ అందించారు.

## దాతలకు సత్కారం



దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుడిపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారం మరువలేనిదని నరహరిపేట జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దూర్వాసులు అన్నారు. సోమవారం ముత్తువాళ్ళూరు గ్రామానికి చెందిన పాఠశాల పూర్వవిద్యార్థులు ఎస్. బాబు నాయుడు, ఎస్. నీరజాక్షులు నాయుడు పాఠశాలకు రూ.45వేలు విలువచేసే కుర్చీలు, రూ.30 వేలు విలువ చేసే సాఫ్ట్ బాల్, బేస్ బాల్ తదితర క్రీడాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పీడీలు రవి, గురుప్రసాద్, ఎంఈవోలు హసన్‌బాషా, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజల సమస్యలను వింటున్న థామస్

శ్రీరంగరాజపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):సమస్యల పరిష్కరించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. సోమవారం రాత్రి పాతపాళ్యంలో ఆయన పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. భూములు ఇచ్చి పరిశ్రమ ఏర్పాటుకు సహరించాలని ఆయన రైతులను కోరారు. నియోజకవర్గాని పారిశ్రామిక హబ్‌గా మారుస్తామన్నారు. దీనివల్ల యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గ్రామస్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో వనజ, మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నీరంజన్‌రెడ్డి, భాస్కర్ నాయుడు, గిరి,అధికారులు పాల్గొన్నారు..

# ముమ్మరంగా వరినాట్లు



కొత్తవెంకటాపురంలో పూర్తయిన నాట్లు





మోతరంగనపల్లె సమీప పొలాల్లో నాట్లు వేస్తున్న కూలీలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతలంతా వరిసాగులో తలమునకలై ఉన్నారు. ఇటీవల వర్షాలకు వరినాట్లు జోరందుకున్నాయి. తూగుండ్రం, అంబోధరపల్లె, ఎల్లాపల్లె, కొత్త వెంకటాపురం, గరిగలపల్లె, మహదేవమంగళం, వీరకనెల్లూరు, అగరమంగళం, ఇ.ఆర్. కండిగ, కడపగుంట, ఆత్మకూరు చెరువులు నిండి మొరవపారాయి. మిగిలిన చెరువుల్లో కూడా 80 నుంచి 90శాతానికి నీరు చేరింది. ఫలితంగా వ్యవసాయ బావులు, బోరు బావుల్లో నీటిమట్టం పెరిగింది. ఈనేపథ్యంలో రైతులంతా ఉత్సాహంగా వరిసాగు వైపు అడుగులేస్తున్నారు. కొందరు వరినాట్లు పూర్తిచేశారు. మరికొందరు కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా 820 ఎకరాల్లో వరి సాగుచేశారన్నారు. ఈ రబీసీజన్‌లో ఇప్పటికే 65 ఎకరాల్లో వరిసాగు పనులు ఊపందుకున్నాయన్నారు. వచ్చే జనవరి నెలాఖరులోపు సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు.

## భక్తి,విశ్వాసాలతో పరిపూర్ణత



హాజరైన నగరవాసులు- ప్రవచనాలు వినిపిస్తున్న రాధామనోహర్ దాస్

చిత్తూరు కల్చరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తిలో అంచంచలమైన విశ్వాసం, భక్తి ఉంటాయని, వాటిని సరైన మార్గంలో పెట్టిననాడే పరిపూర్ణ వ్యక్తి అవుతాడని ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాధామనోహర్ దాస్ అన్నారు. స్థానిక నగర పాలక నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం భజగోవిందం ప్రవచన కార్యక్రమాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భగవంతుడు వేరు వ్యక్తి వేరు కాదని , వ్యక్తి లోని భగవత్ దర్శనం చేసుకున్న మహానుభావుడు రామానుజాచార్యులు అని పేర్కొన్నారు. నిత్యం భగవత్ ప్రార్థన చేయడం వెనుక ఎంతో శాస్త్రీయత ఉందన్నారు. ఇది శరీరానికి కాస్త శ్రమనివ్వడం ద్వారా ఆరోగ్యం కలుగజేస్తుందన్నారు. భజగోవిందం ఆధ్యాత్మికంగానే కాక నైతిక ప్రవర్తనకు దిక్సూచి లాంటిదన్నారు. ఈ ప్రవచన కార్యక్రమం మరో మూడు రోజల పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దంద్రులు చెన్న కేశవులు నాయుడు దంపతులు, జీడీ గోపి, కళ్యాణ్ చక్రవర్తి, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా మహా కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు కల్చరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పూనేపల్లెలో వెలసిన ముత్యాలమ్మ ఆలయ మహా కుంభాభిషేక పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. పూజల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,మేయర్ అముద, చుడా చైర్మన్ కటారి హేమలతలు పాల్గొని పూజలు చేశారు. వారికి ఆలయ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో లోకేష్, నళిని తిరు కుమరన్, నవీన్ కుమార్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతి మహిళా ఆర్థిక శక్తిగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న చినబాబు

నగరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ చినబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన డ్వాక్రా మహిళల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో మహిళల అభ్యున్నతికి కుటీర, సూక్ష్మ పరిశ్రమలకు ప్రాధాన్యతనిచ్చి రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. గతంలో బ్యాంకు లావాదేవీలు సక్రమంగా ఉండి సజావుగా ఖాతాలను నిర్వహించే వారికి ఇది మండి అవకాశమన్నారు. ప్రతి మహిళ రూ.50 వేల నుంచి రూ. కోటి వరకు ఎంఎస్ఎంఈ కార్పొరేషన్‌లో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. సమావేశంలో నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు బాలాజీ, మెప్మా అధికారి ప్రసాద్, నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేది జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని వైద్యాధికారి డాక్టర్ సంధ్య కోరారు. సోమవారం గుడిపాల పీహెచ్‌సీలో ఆశ, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ళలోపు వయసున్న పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేయించడం వల్ల జీవితంలో పోలియో వ్యాధి సోకదన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యనారాయణ, చంద్రశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కైలాసయాదవ్ ఎన్నికపై హర్షం

విజయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కోసలనగరానికి చెందిన కైలాస యాదవ్ ఎన్నికవ్వడంపై ఆపార్టీ నా యకులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. ఆయన మండల బీజేపీ అధ్యక్షుడిగా, జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, జిల్లా పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. కైలాసం యాదవ్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు రాము, నాయకులు యుగందర్‌రాజు, పురుషోత్తంరెడ్డి, మునిరెడ్డి పలువురు కార్యకర్తలు సత్కరించారు.

## సదాశివేశ్వరుడికి విశేష పూజలు



వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలోని శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలను నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా లక్ష్మీ అష్టోత్రం, విష్ణు సహస్రనామం, దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఆలయ వద్ద వన భోజనం ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సంకట చతుర్థి పూజలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) దొడ్డిపల్లె షుగర్ ఫ్యాక్టరీ వద్ద సంపద వినాయక స్వామి ఆలయంలో సోమవారం శ్రీనివాస్ గురుకుల్ స్వామికి భక్తి శ్రద్దలతో సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు.భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు

## వైభవంగా కార్తీక సోమవారం పూజలు



భక్తులకు వన భోజన కార్యక్రమం

నగరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బుగ్గ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో కార్తీక సోమవారం పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద వేదమంత్రోచ్ఛారణలు మిన్నంటాయి. మాజీ మంత్రి రోజా, ఆమె సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూజలో పాల్గొన్నారు. అనంతరం కాశీ విశ్వేశ్వర స్వామికి, అన్నపూర్ణేశ్వర స్వామికి నిర్వహించిన అభిషేక పూజల్లో పాల్గొని కర్పూర హారతులు స్వీకరించారు. భక్తులు ఉసిరి చెట్టు, జమ్మిచెట్లకు పసుపు కుంకుమ పెట్టి హారతులు ఇచ్చారు. 300 మందికి నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు.

## ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యలకు పరిష్కారం చూపిస్తామని కార్వేటినగరం తహసీల్దార్ కె.నాగరాజు తెలిపారు. కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపిస్తామన్నారు. ఆరు సమస్యలపై వినతిపత్రాలు వచ్చాయన్నారు.

## పీఏసీఎస్ సిబ్బంది నిరసన

నగరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం పీఏసీఎస్ సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డీసీసీబీ బ్యాంకు సూపర్‌వైజర్ ఆనందబాబుకు వినతిపత్రం అందించారు. జీవో నెం.36ని తక్షణం అమలు చేయాలని, 2019 నుంచి 24 వరకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను అమలుచేయాలన్నారు. బీమా సౌకర్యం కల్పించాలన్నారు.సీఈవోలు తులసిపిళ్లై, సుబ్రహ్మణ్యం, రాధ పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ఎనలేని కృషిచేసిన సీఎం చంద్రబాబు దివ్యాంగుల పాలిట దేవుడ య్యారని ఉమ్మడి జిల్లా టీడీపీ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఇర్షాద్, మండల టీడీపీ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు రెడ్డిశేఖర్ నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో సోమవారం మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఇంద్రధనస్సు పేరుతో వరాలు ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఔను.. ఇది అతిథి గృహమే!



వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఆర్అంట్‌బీ శాఖ అతిథి గృహం అనాధగా మిగిలింది. ఐదేళ్ల క్రితం నిర్మించిన ఈ అసంపూర్తి భవనం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. 2020 నవంబరులో నాటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి దీనికి ప్రారంభోత్సవం కూడా చేశారు. అయితే పైకి భవనం బాగానే ఉన్నా మౌలిక వసతులు కల్పించలేదే. కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించలేదు. ఆలన పాలన లేకుండా వదిలేయడంతో భవన పరిసరాల్లో పిచ్చి మెక్కలు పెరిగిపోయాయి. పేడ దిబ్బలూ పేరుకుపోయాయి. పశువులు సేద తీరుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రహరీ నిర్మించి కనీస వసతులు కల్పించి అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.